# అపురూప స్మారక సంచిక : ఒక సమీక్ష

గతించిన వ్యక్తుల జ్ఞాపకార్థం సంతాపసభలు మొదలుకొని స్మారకోత్సవాలు, వర్ధంతులు చెయ్యడం మనకి పరిపాటి. ఆ వ్యక్తుల సంబంధికులు కాని, సన్నిహితులు కాని ఉన్నంతకాలం ఆ జ్ఞాపకాలు ఆత్మీయత, ఆర్ద్రత కలిగి ఉంటాయి; గతించిన వ్యక్తిని మన కళ్లెదుట నిలిపి కదిలింపజేస్తాయి. వారు కూడ గతించిన తరువాత కీర్తిశేషులైన వ్యక్తులు ఇంకా దూరమవుతారు. అప్పుడు వారి గురించిన రచనలు, పుస్తకాలు, వాటిలోని ఫొటోలు - అవే భావితరాలకి శరణ్యం. అవే స్మారకసంచికలు.

స్మారకసంచికల తయారీ, నాణ్యము పరిశీలిస్తే పాశ్చాత్య సంస్కృతికి మనం బాగా వెనకబడి ఉన్నా మనిపిస్తుంది. ఆ లోటు తీర్చినది డాక్టర్ గూటాల కృష్ణమూర్తి గారి సంపాదకీయంలో వెలువడిన "Surya kumari Elvin: a memorial volume ". ఇది మూడేళ్ల క్రితం గతించిన ప్రఖ్యాత గాయని, నటీమణి, నర్తకి యైన టంగుటూరు సూర్యకుమారి జ్ఞాపకార్థం ఆయన ఇటీవలే ప్రచురించిన స్మారకసంచిక ('ఎల్విన్' సూర్య కుమారి భర్త పేరు). సూర్యకుమారి ఆదర్శమయ జీవితాన్నీ, బహుముఖ ప్రజ్ఞాపాటవాన్నీ అందంగా చిత్రించి ఈ (ఆంగ్ల, ఆంధ్ర) స్మారకసంచికని ఒక కళాఖండంగా రూపొందించారు కృష్ణమూర్తిగారు.

టంగుటూరు సూర్యకుమారి పేరు తెలియని తెలుగు వారుండరు. ఈ తరంవారికి ఆ పేరుతో అంత పరిచయం లేక పోవచ్చునేమో కాని 40, 50 దశకాల్లో ఆమె పేరు తెలియనివారు లేరంటే అతిశయోక్తి కాదు ('మా తెలుగుతల్లికి మల్లెపూదండ' పాట రాని వారెవరు?) పాటలోనే కాక , అంద చందాలలోనూ (మిస్ మద్రాస్, మిస్ ఇండియా రనర్-అప్), నాట్యము, నటన, అన్నింటిలోను ఆ రోజుల్లో ఓ వెలుగు వెలిగినది సూర్యకుమారి.

ఆమె పాటల్లో - ప్రతి తెలుగు నాలికపైన నిలిచిన 'మా తెలుగుతల్లి' పాటే కాక, భారత స్వాతంత్ర్యోత్సవ సమయంలో పాడిన 'ఉదయమ్మాయెను స్వేచ్ఛాభారత', 'మ్రోయింపు జయభేరి', గాంధిమహాత్ముని నిర్యాణ మప్పుడు పాడిన 'ఓ మహాత్మా, ఓ మహర్షీ!', 'ఇదె జోత నీకిదె జోత', ఇతర సందర్భాల్లో పాడిన 'శతపత్రసుందరి', 'ఎవరు విన్నారెవరు కన్నారు', 'మామిడిచెట్టును అల్లుకొన్నది' మొదలైన రసగుళికలను ఎవరు మరచిపోగలరు?

ఇవేకాక, రేడియో కార్యక్రమాలలోని 'హే భారతజననీ', 'శివోహం' ఇత్యాదులు. సినిమాలలోని 'రావే రావే బంగరు పాప' ('దేవత'), 'జేజేలయ్యా జేజేలు' (కృష్ణప్రేమ'), 'ఇదే మహానంద ప్రభాతములో' ('అప్నాదేశ్') వంటి పాటలకు చిత్రీకరణ ఇంకా వన్నె తెచ్చింది. ఈ పాటలలోసూర్యకుమారి గాన మాధుర్యం, ఆయా పాటలు వ్రాసిన ప్రఖ్యాత కవుల (దేవులపల్లి కృష్ణశాస్త్రి, బసవరాజు అప్పారావు, శ్రీశ్రీ, బాలాంత్రపు రజనీకాంతరావు) సాహిత్యసౌరభాన్ని ఇనుమడింపజేసి, దేశమంతా వెదజల్లింది. ఇటువంటి పాటలన్నింటి వివరాలు ( సంగీతం ఇచ్చినవారి పేర్లతో సహా) మనకి ఈ సంచిక ( అనుబంధాల) లో లభ్యమవుతాయి.

సూర్యకుమారి నటించిన తెలుగు, తమిళ, హిందీ, ఇంగ్లీష్ చిత్రాల వివరాలు కూడ ఈ పుస్తకంలో పొందు పరచారు కృష్ణమూర్తిగారు, ఫొటోలతో సహా. దిలీప్ కుమార్ తో ఆమె నటించిన 'ఉడన్ ఖటోలా' చలనచిత్రంలోని ఫొటోలు అపురూపమైనవి. సినిమాలలోనివే కాక ఇంకా ఎన్నో అరుదైన ఫొటోలున్నాయి ఈ సంచికలో: హిందీ ఇంగ్లీష్ భాషలలో తీసిన 'వతన్' సినిమాలో అశోక్ కుమార్ తో, రేడియో ఇంటర్వ్యూలో సునీల్ దత్ ( అప్పటి బల్ రాజ్) తో, హాలీవుడ్ లో సీసిల్ బి. డిమిల్, ఆల్ఫ్రెడ్ హిచ్ కాక్ వంటి ప్రముఖులతో, జవహర్ లాల్ నెహ్రూ, దలైలామా వంటి రాజకీయ నాయకులతో, - ఇలా ఎన్నో! నాటి తెలుగు

చలనచిత్రాలలోనివి సరేసరి! ఇవేకాక, అప్పటి సినిమా వాల్ పోస్టర్లు, ఎడ్వర్టైజ్ మెంట్లు, ప్రశంసాపత్రాల వంటి 'కలెక్టర్స్ ఐటమ్స్' కూడా ఉన్నాయి.

వీటిలో ముఖ్యంగా చెప్పుకోవలసినది (184 వ పేజీ లోని) ఒక గ్రూప్ ఫొటో ( ఇందులో సూర్యకుమారితో పాటు భానుమతి, పుష్పవల్లి, శాంతకుమారి, టి.ఆర్. రాజకుమారి, రావు బాలసరస్వతీదేవి, కృష్ణవేణి, మాలతి, నాగయ్య, సీయెస్ఆర్, గోవిందరాజుల సుబ్బారావు, లింగమూర్తి, సి. ఎచ్. నారాయణరావు, రంజన్, టి.ఆర్ రామచంద్రన్, మొదలైన వారు)! ఇటువంటి 'నోస్టాల్జిక్ ట్రెజర్స్' ఈ సంచికనిండా కోకొల్లలు!!

ఇక సూర్యకుమారిని గురించిన ఆంధ్ర, ఆంగ్లభాషలలోని పలువురు ప్రముఖుల వ్యాసాలలో చెప్పుకోదగినవి:-

సూర్యకుమారి సంక్షిప్త జీవితచరిత్ర కృష్ణమూర్తిగారు ఎంతో ఆత్మీయతతో వ్రాసినది. వి.ఎ.కె. రంగారావుగారి జ్ఞాపకాలు ఆయనతప్ప మరెవరూ వ్రాయలేరు. దేవగుప్తాపు శేషగిరిరావు గారి 'మా పెద్దక్క', స్పందించి వ్రాసినది. రజనీకాంతరావుగారి వ్యాసం భారతస్వాతంత్ర్య పుక్షణాల్ని మళ్ళీ మనకళ్లముందు నిలుపుతుంది. ఇలాంటివెన్నో సూర్యకుమారికి అక్షరనివాళు లనదగిన రచనలు భారతదేశం నుంచి, ఇంగ్లాండ్ నుంచి సేకరించారు కృష్ణమూర్తి గారు. ఈ హృదయంగమరచనలలోను, ఎంతో ఆకర్షణీయంగా పుస్తకమంతటా తళుకుతళుక్కుమనే చిత్రాలలోను, సూర్యకుమారి వ్యక్తిత్వము, అందచందాలు, పై (ఇంగ్లాండ్) దేశంలో భారతీయసంస్కృతికి చేసినసేవ, సర్వాంగ సుందరంగా కానవస్తాయి.

ఈ స్మారకసంచిక సంపాదకత్వభారం వహించి, ఎంతో శ్రమదమాదులకోర్చి, ఇంత ప్రశస్తంగా ప్రచురించి నందుకు కృష్ణమూర్తిగారు అభినందనీయులు. ఇంతకుముందు శ్రీశ్రీ (స్వహస్తంతో లిఖించిన, స్వంతగొంతుకతో ఆడియో కెసెట్ లో వినిపించిన) మహాప్రస్థానం వెలువరించి కృష్ణమూర్తిగారు పుస్తకప్రచురణలలో ఒక విలక్షణమైన నూతనపద్ధతిని ప్రవేశపెట్టారు. సూర్యకుమారి స్మారకసంచికకూడ త్వరలోనే (బాలాంత్రపు రజనీకాంతరావుగారు ఎంపిక చేసిన) ఆమె పాటల సీడీ ( డిస్క్) తో విడుదల చేస్తానని ఆయన అన్నారు. సూర్యకుమారి సుందరరూపంతో పాటు ఆమె గానమాధురి కూడ అప్పుడు శాశ్వతం అవుతుంది. ఈ సావనీర్ చూసిన మీదట ముంబైలో ప్రఖ్యాత నటుడు దిలీప్ కుమార్ అన్నారట: "ఇస్ సావనీర్ సే కృష్ణమూర్తి సాబ్ నే సూర్యకుమారి కా నామ్ అమర్ కర్ దియా; మర్ నే కే బాద్ హమే భీ ఐసీ సావనీర్ బన్ జాయ్ తో జిందగీ కామయాబ్ హోగీ" ( "ఈ సావనీర్ తో కృష్ణమూర్తిగారు సూర్యకుమారి పేరు చిరస్థాయి చేశారు; పోయినతర్వాత నాకు కూడ ఇలాంటి సావనీర్ లభిస్తే నా జీవితం ధన్యమైనట్టే") !

(ఈ పుస్తకం తెప్పించుకోవాలంటే ఈ ఎడ్రస్ కు వ్రాయండి : Videsandhra publications, 97-D, Brixton road, London, SW9 6 EE, England. వెల ( ఇది నిజంగా అమూల్యం): $150.)

-- జి. వి. ఆర్. కె. శర్మ; బోస్టన్, మాసచూసెట్స్